సాక్షి
వికారాబాద్
గురువారం । 17 । అక్టోబర్ । 2024

పలక పట్టిన బడిలో.. పాఠాలు చెప్పేందుకు



విధుల్లో చేరుతున్న రమేశ్

చదువుకున్న పాఠశాలలోనే ఉపాధ్యాయుడిగా బాధ్యతలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందని మండలంలోని లగచెర్ల గ్రామానికి చెందిన కావలి రమేశ్ అన్నారు. బుధవారం దుద్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రమేశ్ టీచర్‌గా విధుల్లో చేరారు. చిన్ననాటి నుంచి పదో తరగతి వరకు ఇదే పాఠశాలలో చదివినట్లు తెలిపాడు. విద్యార్థులకు అర్థమయ్యేలా, నాణ్యమైన బోధన చేస్తానని అన్నారు. – దుద్యాల్

తర'గతి' మార్చేస్తాం

డీఎస్సీ –2024లో ఎంపికైన అభ్యర్థులు ఎన్నో ఆశలు.. ఆశయాలతో బుధవారం ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించారు. కొత్తగా విధుల్లో చేరిన వారు.. విద్యాభివృద్ధి కోసం పక్కా ప్రణాళికను రూపొందించుకున్నట్లు చెప్పారు. భవిష్యత్ నిర్ణయాలను 'సాక్షి' తో పంచుకున్నారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో 9 మంది కొత్త పంతుళ్లు విధుల్లో చేరారు. గిరిజన, మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులకు చదువు చెప్పే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. – యాలాల

ట్రిపుల్ ఆర్ అమలు చేస్తా



కొత్తగా ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగుపెట్టడం ఆనందంగా ఉంది. మొదటి పోస్టింగ్ గిరిజన తండాలో రావడం సంతోషం. గిరిజన విద్యార్థులకు ట్రిపుల్ ఆర్ విధానంతో బోధన చేస్తా. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రులను ఒప్పించేలా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తా.

– అక్షిత, సంగాయగుట్టతండా పాఠశాల

ప్రణాళికతో సాగుతా



పాఠశాల అభివృద్ధి కోసం ప్రణాళికతో ముందుకు సాగుతా. సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన బోధన అందేలా కృషి చేస్తా. ఉపాధ్యాయుడిగా మొదటి రోజు పాఠశాలలో అడుగుపెట్టడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. విద్యార్థులకు అర్థమయ్యేలా కొత్త పద్ధతులతో బోధన చేపడతా.

– సందీప్, దుబ్బులతండా పాఠశాల

చదువుతోపాటు ఆటలకు..



విద్యార్థులకు చదువుతోపాటు ఆటపాటలకు ప్రాధాన్యత ఇస్తా. వైవిధ్యభరితంగా, సృజనాత్మక విద్యను అందించేందుకు కృషి చేస్తా. కొత్తగా పాఠశాలలో ఉపాధ్యాయుడిగా అడుగుపెట్టడం ఎప్పటికీ మరచిపోలేను. మొదటి రోజు పరిచయ కార్యక్రమం మాత్రమే జరిగింది.

– బాలకృష్ణ, సంగాయిపల్లితండా పాఠశాల

న్యూస్‌రీల్

నేడు ప్రమాణ స్వీకారం



రాజేశ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్

బొంరాస్‌పేట: గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్‌గా శేరి రాజేశ్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. వికారాబాద్‌లోని అంబేడ్కర్ కళాభవన్‌లో ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కాలె యాదయ్య హాజరుకానున్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, నర్సింలు నాయుడు, యూత్ కాంగ్రెస్ నాయకులు మల్లేశ్, రాంచంద్రారెడ్డి తదితరులు తెలిపారు.

పైసలిస్తేనే మెమో, టీసీ!

- గిరిజన ఆశ్రమ పాఠశాలలో వింత ధోరణి
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



మెమో, టీసీ కోసం కొత్తపల్లి ఆశ్రమ పాఠశాలకు వచ్చిన విద్యార్థులు అరుణ్, శివ

కుల్కచర్ల: అందరికీ ఆదర్శంగా నిలవాల్సిన ఆశ్రమ పాఠశాల వివాదాస్పదంగా మారింది. వివరాలు ఇలా ఉన్నాయి.. చౌడాపూర్ మండలం కొత్తపల్లి గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో.. 2023– 24 బ్యాచ్‌కు చెందిన 43 మంది విద్యార్థులు టెన్త్ పాసయ్యారు. వీరిలో కొంత మంది బుధవారం మెమోలు తీసుకునేందుకు స్కూల్‌కు వచ్చారు. అయితే ఒక్కొక్కరి నుంచి రూ.200 నుంచి రూ.500 తీసుకుని మెమో, టీసీ ఇచ్చిన సిబ్బంది.. డబ్బులు లేని వారికి ఇవ్వలేదు. మిడ్జిల్ మండలానికి చెందిన అరుణ్, శివ ఒరిజినల్ టీసీ, మెమో కోసం బుధవారం పాఠశాలకు వచ్చారు. ప్రిన్సిపాల్ లేకపోవడంతో ఆయనకు ఫోన్ చేయడంతో రూ.200 చొప్పున ఇచ్చి తీసుకెళ్లాలని సూచించారు. డబ్బులు లేవని చెప్పినా.. ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ.. డబ్బులిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని సార్ వాళ్లు చెప్పారు. ఈ సమాచారాన్ని మా పేరెంట్స్‌కు చేరవేశాం. వారు గురువారం వస్తామనడంతో రాత్రి ఇక్కడే పడుకుంటున్నాం అన్నారు. ఇదే విషయమై డీటీడబ్ల్యూఓ కమలాకర్‌రెడ్డిని అడగగా.. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల వద్ద ఒక్క రూపాయి కూడా తీసుకోవడానికి వీల్లేదు. నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పెళ్లి కోసం తల్లితో గొడవ

- ప్రేమించిన యువకుడి ఇంట్లో బాలిక తిష్ట
- పోలీసులకు ఫిర్యాదు.. సఖి సెంటర్‌కు తరలింపు
- బషీరాబాద్ మండలంలో ఘటన

బషీరాబాద్: పదహారేళ్ల బాలిక తాను ప్రేమించిన యువకుడితో వివాహం చేయాలని తల్లితో గొడవకు దిగింది. ఇప్పుడే పెళ్లి ఏంటని తల్లి మందలించడంతో.. నేరుగా తాను ఇష్టపడ్డ యువకుడి ఇంటికి వెళ్లింది. వివరాలు ఇలా ఉన్నాయి.. బషీరాబాద్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఎనిమిదో తరగతి చదివి, ప్రస్తుతం టైలరింగ్ చేస్తోంది. ఇదే ఊరికి చెందిన ప్రశాంత్(21) అనే యువకుడితో ప్రేమలో పడింది. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇదే విషయాన్ని సదరు బాలిక గత మంగళవారం తల్లి లక్ష్మికి తెలియజేసింది. దీంతో 'తండ్రిలేని బిడ్డవు.. ఇంకా నీకు పెళ్లి వయసు రాలేదు.. కొంత కాలం ఆగు బిడ్డా' అని సముదాయించింది. ఇది నచ్చని బాలిక తల్లితో వాగ్వాదానికి దిగింది. నువ్వు చేయకపోతే నేనే చేసుకుంటా అని చెప్పి ప్రశాంత్ ఇంటికి వెళ్లింది. ఈ ఘటనతో అబ్బాయి కుటుంబ సభ్యులు సైతం నిర్ఘాంతపోయారు. బాలిక తల్లి చైల్డ్‌లైన్ 1098కు కాల్ చేసి జరిగిన విషయం చెప్పింది. బుధవారం ఉదయం బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన కూతురు పెళ్లిని అడ్డుకోవాలని కోరింది. తన బిడ్డను మందలిస్తే ప్రశాంత్ తనను బెదిరించాడని ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై జిల్లా బాలల హక్కుల పరిరక్షణ విభాగం లీగల్ అధికారి నరేష్, ఎస్‌ఐ గఫార్ సిబ్బందితో యువకుడి ఇంటికి వెళ్లి విచారణ జరిపారు. అనంతరం పోలీసులు ప్రశాంత్‌ను పీఎస్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహం చెల్లదని, చట్టప్రకారం శిక్షార్హులవుతారని హెచ్చరించారు. పద్దెనిమిదేళ్లు ఏళ్లు నిండిన తర్వాత అదే యువకుడితో పెళ్లి చేస్తామని బాలికకు భరోసా ఇచ్చారు. అప్పటి వరకు చదువుకోవాలని వికారాబాద్‌లోని సఖి కేంద్రానికి తరలించారు.

పత్తి సేకరణకు కసరత్తు

నవంబరు మొదటి వారంలో ప్రక్రియ ప్రారంభించే అవకాశం

- జిల్లాలో 2,30,000 ఎకరాల్లో పంట సాగు
- 2,03,000 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా
- 14 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం



వికారాబాద్: జిల్లాలో పత్తి కొనుగోలుకు సీసీఐ అధికారులు కసరత్తు చేస్తున్నారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల సమన్వయంతో పత్తి సేకరణకు సిద్ధమవుతున్నారు. అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ కొనుగోలు ప్రక్రియ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. వానలు తగ్గుముఖం పట్టి ఎండలు ప్రారంభమైన 15 రోజుల్లో రైతులు పత్తి తీసే అవకాశం ఉంది. జిల్లాలో సాగవుతున్న పత్తి పంట విస్తీర్ణం.. ఉత్పత్తి అంచనాపై సీసీఐ అధికారులు దృష్టి సారించారు. పత్తి సేకరణ కోసం కాటన్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లా పరిధిలో 14 కాటన్ మిల్లులు ఉండగా గత ఏడాది 10 చోట్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది నాలుగు పెంచి 14 కేంద్రాల ద్వారా పత్తి సేకరించాలని అధికారులు నిర్ణయించారు.

2.3లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు

జిల్లాలో 5,90,000 ఎకరాల్లో ఆయా పంటలు సాగవుతుండగా ఎక్కువ భాగం పత్తి పంటే. 1,20,000ల మంది రైతులు 2,30,000 ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నారు. ఎకరాకు సగటున పది క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఈ లెక్కన జిల్లాలో 2,30,000 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మొత్తం పత్తిని సీసీఐ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని నిర్ణయించింది. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులు ఆదేశించారు. బాత్‌రూంలు, మరుగుదొడ్లు, పార్కింగ్, తాగునీటి వసతి వంటివి కల్పించాలని సూచించారు. గత వారం కొనుగోలు కేంద్రాల నిర్వహణకు సంబంధించి ఆయా శాఖల అధికారులు, కాటన్ మిల్లుల యజమానులతో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ సమావేశం నిర్వహించి పాటించాల్సిన విధి విధానాలను తెలియజేశారు.

ఈ సారైనా సమస్యలను అధిగమిస్తారా?

ఐదారేళ్లుగా పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ వస్తున్నారు. అయినా అధికారులు చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారు. రైతులకు సదుపాయాలు కల్పించడంపై దృష్టి సారించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ సారైనా ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. వికారాబాద్, పరిగి వ్యవసాయ డివిజన్లలో పత్తి పంట అధికంగా సాగవుతోంది. అయితే దిగుబడికి తగ్గట్లు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదని రైతులు అంటున్నారు. తక్కువ సాగవుతున్న తాండూరు ప్రాంతంలో మాత్రం ఎక్కువ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. దీంతో పరిగి, పూడూరు మండలాల పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాని పేర్కొన్నారు. ఈ మూడు కేంద్రాల్లోనే పరిగి, వికారాబాద్ వ్యవసాయ డివిజన్లకు చెందిన రైతులు పత్తి విక్రయిస్తుండటంతో రద్దీ విపరీతంగా ఉంటోంది. దీంతో రైతులు వారాల తరబడి పత్తిని విక్రయించేందుకు కేంద్రాల వద్ద పడిగాపులు గాయాల్సి వస్తోంది. ఈ బాధలు పడలేక కొంత మంది రైతులు దళారులకు పంట దిగుబడి విక్రయిస్తున్నారు.

మద్దతు ధర రూ.7,521

మరో 15 రోజుల్లో పత్తి పంట మార్కెట్‌లోకి రానుంది. గత రెండు సీజన్లలో బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలు ఉండటంతో కొనుగోలు కేంద్రాలకు పత్తి అంతంత మాత్రంగానే వచ్చింది. ఈ ఏడాది పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. బహిరంగ మార్కెట్ కంటే ప్రభుత్వ మద్దతు ధర ఎక్కువగా ఉంది. ఓపెన్ మార్కెట్‌లో క్వింటాలు పత్తికి రూ.6,500 నుంచి రూ.7,000 వరకు ధర పలుకుతోంది. ప్రభుత్వం క్వింటాలు ఏ గ్రేడ్ పత్తికి రూ.7,521, సాధారణ రకానికి రూ.7,121 మద్దతు ధర ప్రకటించింది. పత్తి సీజన్ ప్రారంభమయ్యే నాటికి బహిరంగ మార్కెట్‌లో ధరలు మరింత తపడిపోయే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఎక్కువ మంది రైతులు కొనుగోలు కేంద్రాలకు పత్తి తెచ్చే అవకాశం ఉంది.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



జిల్లాలో పత్తి సేకరణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సీసీఐ అధికారులు, కాటన్ మిల్లు యజమానులకు ఆదేశాలు జారీ చేశాం. జిల్లాలోని అన్ని పత్తి మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. పత్తి విక్రయించిన మూడు రోజుల్లో ఆన్‌లైన్ ద్వారా రైతుల ఖాతాల్లో డబ్బులు జమా చేస్తాం.

– లింగ్యానాయక్, అడిషనల్ కలెక్టర్



ఘటన స్థలంలో వివరాలు సేకరిస్తున్న ఫారెస్టు రేంజ్ అధికారి

వామ్మో చిరుత

- రేళ్లగడ్డతండాలో కోడెదూడపై దాడి
- పాదముద్రలు సేకరించిన ఫారెస్ట్ అధికారులు
- దాడి చేసింది చిరుతపులేనని నిర్ధారణ
- రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

యాలాల: మండల పరిధిలోని రేళ్లగడ్డతండాలో చిరుతపులి సంచారం కలకలం రేపింది. పశువుల పాకలో కట్టేసిన ఓ కోడెపై దాడి చేసి చంపింది. సమీప పొలాల్లో పాదముద్రల ఆధారంగా దాడికి పాల్పడింది చిరుతనేనని ఫారెస్ట్ అధికారులు ధ్రువీకరించారు. బుధవారం ఉదయం ఈ ఘటన వెలుగు చూడగా సమీప ప్రాంతాల రైతులు, తండావాసులు భయాందోళన చెందుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రేళ్లగడ్డతండాకు చెందిన సక్రీబాయి ఎప్పటిలాగే మంగళవారం రాత్రి తన పశువులను పొలం సమీపంలోని పాకలో కట్టేసి ఇంటికి వెళ్లింది. మరుసటి రోజు ఉదయాన్నే వెళ్లి చూడగా ఓ కోడె దూడ చనిపోయి ఉండటాన్ని గమనించి, స్థానికులకు సమాచారం ఇచ్చింది. దూడ కడుపు, వెనక భాగంలో జంతువులు దాడి చేసి, తిన్నట్లు గమనించి వెంటనే అటవీశాఖ అధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎఫ్‌ఆర్‌ఓ రాజేందర్, యాలాల ఎస్‌ఐ శంకర్ ఆధారాలు సేకరించారు. దూడపై దాడి చేసిన ప్రదేశంతో పాటు పొలాల్లో పాదముద్రలను గుర్తించారు. వీటి ఆధారంగా దాడికి పాల్పడింది చిరుతే అని అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. దీంతో రేళ్లగడ్డతండా, పటేల్‌చింత తండా, పగిడిపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు భయాందోళనకు గురవుతున్నారు.



చిరుతపులి పాదముద్ర

పరిహారం అందేలా చూస్తాం

చిరుత దాడిలో దూడ మృతిచెంది, నష్టపోయిన రైతు సక్రీబాయికి ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూస్తామని ఎఫ్ఆర్ఓ రాజేందర్ తెలిపారు. అటవీ ప్రాంతంలోకి పశువులను మేతకు తీసుకెళ్లే రైతులు ఒంటరిగా ఉండకూడదని సూచించారు. పొలాల వద్ద పనులు చేసుకునే సమయంలోనూ అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి వేళ పశువుల పాకల సమీపంలో మంట పెట్టాలని తెలిపారు. రేళ్లగడ్డతండాలో చిరుత సంచరిస్తోందనే సమాచారం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సోషల్ మీడియాలోనూ ఇందుకు సంబంధించిన ఫొటోలు, వివరాలు వైరల్‌గా మారాయి. తిమ్మాయిపల్లి సెక్షన్ పరిధిలోని రిజర్వ్ ఫారెస్టు ఉండటం, కొండలు, గుట్టలతో దట్టమైన అడవి కారణంగానే చిరుత సంచారం వెలుగుచూసినట్లు అధికారులు చెబుతున్నారు. చిరుత ఆనవాళ్లు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ శంకర్ రైతులకు సూచించారు. రాత్రి వేళ ఒంటరిగా పొలాల వద్దకు వెళ్లకూడదని తెలిపారు.



కుల్కచర్లలో సభ్యత్వ నమోదు చేయిస్తున్న శిరీషా తదితరులు

హామీల అమలులో విఫలం

మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు శిరీషా

కుల్కచర్ల: తెలంగాణలో రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు శిరీషా, ప్రధాన కార్యదర్శి పి సౌమ్యారెడ్డి అన్నారు. బుధవారం కుల్కచర్లలో బీజేపీ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రతి నెలా మహిళలకు రూ.2,500 ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినా సరిపడా బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. గ్యాస్ సబ్సిడీకి లేనిపోని కారణాలు చూపుతూ అర్హులకు పథకం అమలు చేయడం లేదని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అత్యధిక స్థానాలు గెలుచుకునేందుకు కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. మహిళా కార్యకర్తలు కీలకంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సురేష్, మాజీ సర్పంచ్ జానకీరాం చౌహాన్, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ధాన్యం సేకరించాలి

కలెక్టర్ ప్రతీక్‌జైన్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ప్రస్తుత సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ధాన్యం సేకరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. సన్న రకం, దొడ్డు రకం వడ్ల సేకరణకు వేర్వేరు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి కేంద్రానికి వేయింగ్ మిషన్, ట్యాబ్ సమకూర్చాలన్నారు. రైతులకు తాగునీటి వసతి, మరుగుదొడ్ల సౌకర్యం ఉండేలా చూడాలని ఆదేశించారు. ధాన్యం సేకరణలో ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తేవాలన్నారు. క్వింటాలు సన్న రకం వడ్లకు ప్రభుత్వం రూ. 500 బోనస్ ఇవ్వనుండటంతో జాగ్రతలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్‌డీఏ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మోహన్‌రెడ్డి, డీసీఎస్ఓ మోహనబాబు, డీఎంసీఎస్ విజయలక్ష్మి, మార్కెటింగ్ శాఖ అధికారి సారంగపాణి, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి డ్రోన్ సర్వే

రాబోయే 30 నుంచి 40 సంవత్సరాలకు తగ్గట్టుగా వికారాబాద్ పట్టణాభివృద్ధి కోసం కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు సర్వే చేస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, సర్వే ఆఫ్ ఇండియా అధికారులు, డీటీసీపీ అధికారుల ఆధ్వర్యంలో డ్రోన్‌కు పూజ చేసి సర్వే ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికారాబాద్ పట్టణ అభివృద్ధిలో భాగంగా మాస్టర్ ప్లాన్ తయారవుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0లో భాగంగా రాష్ట్రంలో 50వేల నుంచి లక్ష జనాభా కలిగిన 20 మున్సిపాలిటీల్లో మాస్టర్ ప్లాన్ కోసం డిజిటల్ సర్వే చేస్తోందన్నారు. ఇందులో వికారాబాద్ పట్టణానికి చోటు లభించిందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, సర్వే ఆఫ్ ఇండియా జాయింట్ డైరెక్టర్ భాస్కర్ చంద్ర ఫరీదా, డీటీసీపీ అడిషనల్ డైరెక్టర్ రమేష్ బాబు, మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ రాకేష్ రెడ్డి, టీపీఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కేఎల్ఐలో కృష్ణా జలాలు

ఆమనగల్లు: కల్వకుర్తి ఎత్తిపోతల పథకం(కేఎల్ఐ) డీ–82 కాల్వ నుంచి కృష్ణా జలాలు పారుతుండంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కేఎల్ఐ పథకంలో భాగంగా ఆమనగల్లు, వెల్దండ, మాడ్గుల మండలాల పరిధిలో దాదాపు 37వేల ఎకరాలకు సాగు నీరందించేందుకు డీ–82 కాల్వ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఏడేళ్ల క్రితమే అనుమతులిచ్చింది. ఇందుకు రూ.178 కోట్లు నిధులు మంజూరు చేసింది. కల్వకుర్తి మండలం జంగారెడ్డిపల్లి నుంచి వెల్దండ, ఆమనల్లు మాడ్గుల మండలంలోని నాగిళ్ల వరకు కాల్వ నిర్మాణం చేపట్టారు. ఆమనగల్లు మండలంలో పోలెపల్లి, సింగంపల్లి గ్రామాల పరిధిలో ఎనిమిది కిలోమీటర్లు, మాడ్గుల మండలం అవురుపల్లి, దొడ్లపహాడ్, అప్పారెడ్డిపల్లి, నాగిళ్ల వరకు కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. దాదాపు 90 శాతం పనులు పూర్తయినప్పటికీ నాలుగేళ్లుగా పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఎమ్మెల్సీగా ఉండి కాలువ నిర్మాణానికి కోసం కృషి చేసిన కసిరెడ్డి నారాయణరెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో ప్రత్యేక శ్రద్ధతో కాలువ నిర్మాణానికి కృషి చేశారు. నెలరోజుల క్రితం ఆయన ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి అసంపూర్తి పనులను పరిశీలించారు. నెల రోజుల్లో పనులు పూర్తిచేసి సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు పనులను పూర్తిచేయించి సాగునీరును విడుదల చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఆమనగల్లు మండలంలో రెండుచోట్ల అసంపూర్తి పనులు పూర్తయితే మాడ్గుల మండలంలోని నాగిళ్ల వరకు కృష్ణజలాలు చేరుతాయి.



కేఎల్ఐ కాలువలో పారుతున్న కృష్ణా జలాలు

క్లుప్తంగా

యువకుల ముందడుగు



సిమెంట్ మిశ్రమంతో గుంతలను పూడ్చుతున్న యువకులు

కుల్కచర్ల: ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూడకుండా తమ గ్రామ పరిధిలో గుంతలు పడిన రహదారిని యువకులు ముందుకు వచ్చి బాగు చేశారు. మండల పరిధిలోని వాల్యా నాయక్ తండా– రాంసింగ్ నాయక్ తండా పరిధిలో ఉన్న ప్రధాన రహదారి కొన్ని చోట్ల గుంతలు పడి వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. గ్రామానికి చెందిన యువకులు బాబి, రాజు, రాహుల్, హన్మంతు, రామ్, సచిన్, దశరథ్‌లు కొంత డబ్బులు వేసుకుని గుంతలు పడిన చోట సిమెంట్, ఇసుక మిశ్రమాన్ని వేశారు. యువకులు స్వచ్ఛందంగా స్పందించడం అభినందనీయమని గ్రామస్తులు, వాహనదారులు పేర్కొన్నారు.

బాధ్యతల స్వీకరణ



విధుల్లో చేరిన సీహెచ్‌ఓకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

యాలాల: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీహెచ్‌ఓ(కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్)గా చంద్రప్రకాష్ బుధవారం విధుల్లో చేరారు. ఇంతకుముందు ఇక్కడ సీహెచ్‌ఓగా విధులు నిర్వహించిన చంద్రశేఖర్ నల్గొండ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నల్గొండ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న చంద్రప్రకాష్‌ను యాలాల పీహెచ్‌సీని కేటాయించారు. విధుల్లో చేరిన ఆయనకు పీహెచ్‌సీ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యురాలు భువనేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ బసయ్యగౌడ్, ఏఎన్‌ఎంలు లక్ష్మీ, జగదీశ్వరి, ల్యాబ్ టెక్నీషియన్ భారతి తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో టెక్నికల్ అసిస్టెంట్ మృతి

తాండూరు రూరల్: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఓ టెక్నికల్ అసిస్టెంట్ గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. మండలంలోని నాగసమందర్ గ్రామానికి చెందిన ఎం.కిరణ్‌కుమార్(38) తాండూరు ఉపాధిహామీ పథకం కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం బైక్‌పై కార్యాలయానికి వచ్చిన ఆయన మధ్యాహ్నం ఛాతిలో నొప్పి వస్తోందని భార్య హారికకు ఫోన్‌లో తెలిపి ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలోని పెద్దేముల్ సమీపంలో బైక్ ఆపి అక్కడే నిల్చున్నాడు. వెంటనే కిరణ్ సోదరుడు వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. వైద్యులు పరీక్షించి కిరణ్ మృతి చెందినట్లు చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా రోదించారు.

భవనంపై నుంచి పడి కూలీ మృతి

అనంతగిరి: భవన నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఓ వలస కూలీ కాలు జారి కింద పడి మృతి చెందాడు. ఈ సంఘటన వికారాబాద్ పట్టణంలోని ఎన్నెపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన వడ్డె అశోక్(35) కొంతకాలంగా వికారాబాద్‌లోనే కుటుంబంతో ఉంటూ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా బుధవారం సైతం ఎన్నెపల్లిలో ఓ బిల్డింగ్‌లో 6వ అంతస్తులో పనులు చేస్తున్నాడు. ఒక్కసారిగా కాలు జారి కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన సదరు కూలీలు వెంటనే పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. మృతుడికి భార్య సుజాత, ముగ్గురు పిల్లలున్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ కుటుంబీకులు, కూలీలతో కలిసి మృతదేహంతో రాత్రి బిల్డింగ్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. బాధితులకు రూ.50లక్షల నష్ట పరిహారం చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు. కాగా పలువురు సర్దిచెప్పడంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని వికారాబాద్ పోలీసులు తెలిపారు.

ప్రాణాలు పోతున్నా పట్టదా?

- ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు
- మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- పట్టించుకోని అధికారులు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు

నవాబుపేట: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. వాటికి కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. రోడ్డు పక్కన, వ్యవసాయ పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయండి మహాప్రభో అని నెత్తీ నోరు మొత్తుకున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

భయాందోళనలో ప్రజలు

మండల పరిధిలోని ఎల్లకొండ, లింగంపల్లి, చిట్టిగిద్ద, కేశవపల్లి, మమ్మదాన్‌పల్లి, కుమ్మరిగూడ, నవాబుపేట, మాదిరెడ్డిపల్లి తదితర గ్రామాల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేవు. అలాగే ఆర్ అండ్‌బీ, పంచాయతీ రోడ్ల వెంబడి గ్రామాలకు అతి చేరువలో కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఈ రోడ్లపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు పక్కన ఉన్న వాటికి కంచె లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారు.



ఎల్లకొండలో ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృతి చెందిన ఎద్దు (ఫైల్)

బలవుతున్న మూగజీవాలు

కంచెలు లేని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. నెల రోజుల్లో మండలంలో ఐదు మూగజీవాలు విద్యుదాఘాతానికి బలయ్యాయి. ఎల్లకొండ, లింగంపల్లి, కేశవపల్లి గ్రామాల్లో మూడు ఎద్దులు, రెండు గేదెలు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి ప్రాణాలు కోల్పోయాయి. దీంతో ఒక్కో రైతుకు దాదాపు రూ.50 నుంచి రూ.80 వేల వరకు నష్టపోయారు. వారికి ప్రభుత్వం, విద్యుత్ శాఖ నుంచి గాని ఎలాంటి నష్టపరిహారం అందలేదు. కేవలం విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంతో మూగజీవాలు మృత్యువాత పడుతూ రైతులు నష్టపోతున్నా అధికారులు మాత్రం స్పందించడం లేదు. కనీసం ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె అయినా ఏర్పాటు చేయడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

నిధులు లేవు

ఈ విషయమై విద్యుత్ ఏఈ ప్రమోద్‌ని వివరణ కోరగా.. నిధులు లేక ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయడం లేదని తెలిపారు. నిధుల కోసం ఉన్నతాధికారులకు నివేదించామని చెప్పారు. రైతులు సైతం పశువుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లకుండా చూసుకోవాలని సూచించారు.

మంచు కురిసిన వేళ



వ్యాపించిన పొగమంచు

ధారూరు: పొగమంచుతో రహదారులన్నీ కమ్ముకున్నాయి. బుధవారం తెల్లవారుజామున తాండూరు–వికారాబాద్ వెళ్లే మార్గంలో ధారూరు వద్ద మంచు విపరీతంగా కురిసింది. అలాగే మండల కేంద్రాన్ని పొగమంచు ఆవరించి ఎదురుగా వస్తున్న వారు సైతం కన్పించని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో పొగమంచు కురిసిన దృశ్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. మంచుతో పంట పొలాలు దెబ్బతింటాయని రైతులు భావిస్తున్నారు.



ధారూరు ప్రధాన రోడ్డును కమ్మేసిన మంకురు

సర్వే చేస్తుండగా విషాదం

విద్యుదాఘాతంతో ఇరిగేషన్ ఉద్యోగి దుర్మరణం



ఇస్మాయిల్ (ఫైల్)

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు కుడి కాలువలో సర్వే చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ ఇరిగేషన్ ఉద్యోగి దుర్మరణం చెందారు. ఈ విషాద సంఘటన మండల పరిధిలోని నాగసమందర్ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్, ఇరిగేషన్ డీఈఈ భాస్కర్‌గౌడ్, గ్రామస్తుల వివరాల మేరకు.. కోట్‌పల్లి మండలం ఎన్నెపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ ఇస్మాయిల్(45) ఇరిగేషన్‌శాఖలో లస్కర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఆయన కోట్‌పల్లి ప్రాజెక్టు కాలువల పర్యవేక్షణ చూస్తుంటారు. ఆయన బుధవారం కోట్‌పల్లి కుడి, ఎడమ కాల్వలో సిబ్బందితో కలిసి ఆధునికీకరణ కోసం సర్వే చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన పొడవైన అల్యూమినియం ఫ్రేంతో పని చేస్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. అతనికి భార్య అలీమాబేగం, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ధారూరు సీఐగా రఘురాములు



ధారూరు: ధారూరు నూతన సీఐగా రఘురాములును నియమిస్తూ పోలీసు శాఖ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వికారాబాద్ సీసీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు ధారూరు సర్కిల్ బాధ్యతలు అప్పగించారు.

విద్యుత్ తీగలను తొలగించండి



వంతెన రోడ్డుపై వేలాడుతున్న విద్యుత్ తీగలు

వంతెన పనులకు ఆటంకంగా మారిన వైర్లు

ధారూరు: నత్తకు నడక నేర్పినట్లు తయారయింది.. మండలంలోని స్టేషన్‌ధారూరు–దోర్నాల్ గ్రామాల మధ్య కాగ్నానదిపై నిర్మిస్తున్న వంతెన పరిస్థితి. వంతెన నిర్మాణం ప్రారంభించి ఎనిమిదేళ్లు అవుతున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. నిత్యం ఏదో ఒక సమస్యతో ప్రాజెక్టు పనులకు అంతరాయం కలుగుతూనే ఉంది. తాజాగా కాగ్నానదిపై నిర్మిస్తున్న వంతెనకు విద్యుత్ తీగలు ఆటంకంగా మారాయి. దోర్నాల్ గ్రామం వైపు పిల్లర్లపై మూడు స్లాబ్ వేయగా, స్టేషన్‌ధారూరు వైపు మాత్రం వేయలేకపోతున్నారు. దీనికి కారణం వంతెనకు ఇరువైపులా విద్యుత్ తీగలు యమపాశాల్లా వేలాడుతున్నాయి. తీగలను తొలగిస్తేగాని వంతెన పిల్లర్లలో కాంక్రీట్ వేయడానికి వీలు కాదు. దీనిపై ఎన్నిసార్లు వినతులు అందజేసినా విద్యుత్ అధికారులు స్పందించడం లేదు. విద్యుత్ తీగలు వంతెన పనులకు ఆటంకంగా మారాయని, వీటిని వెంటనే తొలగించాలని దోర్నాల్ వాసి నారాయణరెడ్డి కోరుతున్నారు.

అసంపూర్తి వంతెన

ఎనిమిదేళ్లుగా అసంపూర్తిగా నిలిచిన వంతెన పనులు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చొరవతో ఆగస్టు నెలలో ప్రారంభమయ్యాయి. స్టేషన్‌ధారూరు–దోర్నాల్ గ్రామాల మధ్య కాగ్నానదిపై కొత్త వంతెన నిర్మాణానికి 2017లో రూ.4.70 కోట్లు మంజూరు అయ్యాయి. అప్పటి నుంచి ముగ్గురు కాంట్రాక్టర్లు మారిన పనులు మాత్రం అసంపూర్తిగానే మిగిలాయి. ప్రస్తుతం వంతెన పనులకు ఆటంకం కలిగిస్తున్న విద్యుత్ తీగలను తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మేస్త్రీ బలవన్మరణం

అనంతగిరి: మనస్తాపంతో ఓ మేస్త్రీ ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజు తెలిపిన ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం చించోలికి చెందిన ఉప్పరి శ్రీకాంత్(37) ఏడాది కాలంగా వికారాబాద్ మండలం సిద్దులూర్ సమీపంలోని ఓ వెంచర్‌లో మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. ఇటీవల శ్రీకాంత్ తాగిన మైకంలో గొడవ చేస్తున్నాడు. ఈ క్రమంలో దసరాకు దంపతులు పిల్లతో కలిసి సొంతూరుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తాగి గొడవ చేస్తున్నావంటూ భార్యపిల్లలతో కలిసి అక్కడే ఉండిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన శ్రీకాంత్ తాగిన మైకంలో మంగళవారం రాత్రి ఇంట్లోని పైపునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు బుధవారం ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడికి నలుగురు సంతానం. భార్య రేణుక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు

షాద్‌నగర్‌రూరల్: గ్రామ పాలనలో పంచాయతీ అధికారి విధుల పట్ల అలసత్వం వహించడంపై డీపీఓ సురేశ్‌మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఏ) సురేశ్‌మోహన్, డీఎల్‌పీఓ మల్లారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ జయంత్‌రెడ్డితో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ రికార్డులు, మినీట్యాంకులు, తడిచెత్త, పొడి చెత్త, భవన నిర్మాణం అనుమతులు, తాగునీటి పైపు లైన్‌లను పరిశీలించారు. వీటి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి తేజస్వినికి డీపీఓ షోకాజ్ నోటీసు జారీ చేశారు. గత మూడు నెలల నుంచి గ్రామపంచాయతీ సమావేశాలను నిర్వహించకపోవడంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా గ్రామాల అభివృద్ధిలో అధికారులు తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.



మినీట్యాంకు అపరిశుభ్రతపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీపీఓ

వివాహిత అదృశ్యం



రింకీ (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: ఇంట్లోంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం నాబరంగాపూర్ జిల్లాకు చెందిన అశ్విన్ అతని భార్య రింకీ(24)తో కలిసి కొంతకాలంగా మండలంలోని బండరావిరాలలో నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో భర్త లేని సమయంలో రింకీ బయటకు వెళ్లింది. చీకటి పడినా తిరిగి రాకపోవడంతో ఆమె ఆచూకీ కోసం భర్త బుధవారం పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జీపీ నిధులను బ్యాంకుల్లో జమచేయాలి



చేగూరు పంచాయతీలో రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ సురేశ్ మోహన్

డీపీఓ సురేశ్‌మోహన్

కొత్తూరు: గ్రామ పంచాయతీల పరిధిలో అధికారులు, సిబ్బంది ఇళ్లు, పరిశ్రమలు, వ్యాపార సముదాయాల నుంచి వసూలు చేస్తున్న పన్ను రూపేణ వచ్చే నిధులను వెంటనే బ్యాంకుల్లో జమ చేయాలని జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ సూచించారు. బుధవారం ఆయన నందిగామ మండల పరిధిలోని చేగూరు పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య, తాగునీటి పైపులైన్ల లీకేజీతో పాటు పలు అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న రోడ్ల అభివృద్ధి పనులను, కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం డీపీఓ మాట్లాడుతూ.. పంచాయతీల పరిధిలోని సమస్యలను అధికారుల సూచనతో వెంటనే పరిష్కరించాలన్నారు. పంచాయతీ అధికారులు, సిబ్బంది ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. ప్రజలు తమ దృష్టికి తెచ్చే సమస్యలను కాలయాపన లేకుండా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. పాలక వర్గం, అధికారులు పంచాయతీలకు ఆదాయం వచ్చే మార్గాలపై దృష్టి సారించాలన్నారు.

'మల్టీపర్పస్' రద్దు చేయాలి

గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి

కొందుర్గు: మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కొందుర్గు ఎంపీఓ లాలయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులను నియమించి మల్టీపర్పస్ విధానాన్ని అమలుచేసి వారితో వెట్టిచాకిరీ చేయించిందన్నారు. అదే విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం దారుణమన్నారు. జీపీ వర్కర్లకు వారంతపు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులుగా దళిత, గిరిజనులు మాత్రమే పనిచేస్తున్నారన్నారు. పారిశుద్ధ్యం పనులు నిర్వహించే వారికి అంటువ్యాధులు సోకకుండా బ్లౌజ్‌లు, బూట్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్య, రాములు, సత్యనారాయణ, యాదమ్మ, రఫీ, సత్యయ్య, రత్నమ్మ, శేఖరమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సిరిగిరిపేట్‌లో ఉద్రిక్తత

భూమిని చదును చేస్తుండగా రియల్టర్లను అడ్డుకున్న గ్రామస్తులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని సిరిగిరిపేట్‌లో బుధవారం ఉద్రిక్తత నెలకొంది. గ్రామ సమీపంలోని భూమిలో హద్దులు ఏర్పాటు చేసేందుకు వచ్చిన రియల్టర్లను స్థానికులు అడ్డుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఊరి శివారులోని 105, 106 సర్వే నంబర్లలో 26 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఏడాదిన్నర క్రితం అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ భూమిని వేలం వేసి అమ్మేసింది. ఒక్కో ఎకరా కొందరు రూ.16 లక్షల చొప్పున కొనుగోలు చేశారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది. కొనుగోలు చేసిన వ్యక్తులు రియల్టర్లకు అమ్ముకున్నారు. అప్పటినుంచి ఎవరూ ఇటు వైపు రాలేదు. సదరు స్థలాన్ని కొనుగోలు చేసిన వ్యక్తులు బుధవారం భూమిని చదును చేస్తుండగా గ్రామస్తులు వెళ్లి అడ్డుకున్నారు. తమ గ్రామంలో ఉన్న కొద్ది ప్రభుత్వ భూమిని మాకు సమాచారం ఇవ్వకుండా అమ్మేయడం ఎంటని ప్రశ్నించారు. ఇక్కడ ఎలాంటి కార్యకలపాలు నిర్వహించొద్దని రియల్టర్లను హెచ్చరించారు.



రియల్టర్ల లారీని అడ్డుకుంటున్న గ్రామస్తులు

శ్రమ తక్కువ.. దిగుబడెక్కువ



పాలీహౌస్‌లో సాగు చేస్తున్న జెర్బరా సాగు



మార్కెట్‌కు తీసుకువెళ్లేందుకు సిద్ధంగా ఉన్న పూలు

- జెర్బరా సాగుతో లాభాలు బాగు
- పాలీహౌస్‌లో పూలసాగుకు మొగ్గు చూపుతున్న రైతులు

షాబాద్: పాలీహౌస్‌లో జెర్బరా సాగు లాభాలు కురిపిస్తున్నాయి. మూడు నెలలు కష్టపడితే ఆదాయం సమకూర్చుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవటమే కాదు.. పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదుగుతున్నారు. ప్రతిఒక్కరూ అలంకరణకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో ఉద్యాన ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుంది. మార్కెట్లో అలంకరణ పూలకు పెరుగుతున్న గిరాకీ రైతులను ఆలోచింపజేసింది. తక్కువ శ్రమతో అధిక లాభాలు రావడం గమనించి ఎక్కువ మంది పాలీహౌస్ సాగుకు మొగ్గు చూపుతున్నారు. షాబాద్ మండలంలోని ఎర్రొనిగూడ, నాగరగూడ, కక్కులూర్, హైతాబాద్, షాబాద్ తదితర గ్రామాల్లో రైతులు జెర్బరా పూల సాగు చేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్లోకి వస్తున్న అలంకరణ పూలలో 90 శాతం బెంగళూరు, మహారాష్ట్ర, పూణే నుంచి దిగుమతి అవుతున్నాయి. డిమాండ్ ఉన్న పూలను ఇక్కడ ఎందుకు సాగు చేయకూడదనే ఆలోచనతో కొంత మంది రైతులు అలంకరణ పూలసాగు చేపట్టారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో మండలంలో రైతులు పాలీహౌస్ విధానంలో జెర్బరా, కార్నేషన్, కట్‌ఫ్లవర్స్ పూల సాగు చేపడుతున్నారు.

ఒక్కసారి పెడితే ఐదేళ్ల వరకు..

ఎండ తీవ్రత, అధిక వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే పాలీహౌస్ విధానంతో పూల సాగు చేయవచ్చు. ఇందుకు ఖర్చు బాగానే అవుతుంది. రైతులకు ఎంతో లాభసాటిగా ఉంది. పాలీహౌస్ విధానంలో అలంకరణ పూల సాగు చేపట్టాలంటే ఎకరాకు రూ.యాభై లక్షల వరకు ఖర్చు వస్తుంది. ఇది పెద్ద రైతులకే సాధ్యమనే అపోహ ఉంది. కానీ ప్రభుత్వం పాలీహౌస్ విధానంలో పూల సాగు చేపట్టే రైతులకు ప్రోత్సాహకాలు అందజేస్తుంది. 50 శాతం రాయితీపై పాలీహౌస్ ఏర్పాటుకు కావాల్సిన పరికరాలు ఇస్తుంది. రుణాలు అందించేందుకు బ్యాంకులు ముందుకు వస్తున్నాయి.

రూ.40 వేలు మిగులుతుంది

పాలీహౌస్ ద్వారా పూలసాగులో రైతులకు మంచి లాభాలు వస్తున్నాయి. రోజుకు ఎంతా లేదన్నా 500 వరకు పూలు వస్తాయి. సీజన్‌లో ఒక్క పువ్వు రూ.15 నుంచి రూ.20 వరకు ధర పలుకుతుంది. మిగతా రోజుల్లో రూ.10నుంచి రూ.12 వరకు ధర పలుకుతుంది. సీజన్ లేని సమయంలో వ్యాపారులు పూలను కొనుగోలు చేసి తమిళనాడు, చెన్నై తదితర ప్రాంతాలకు పంపిస్తున్నారు. పూల సాగు ద్వారా రోజుకు రూ.2వేలు నెలకు రూ.50వేలు వరకు ఆదాయం వస్తుంది. అందులో ఖర్చు రూ.10వేలు పోగా దాదాపు రూ.40 వేల వరకు రైతుకు ఆదాయం చేతికొస్తుంది.

ఎరువుల వినియోగం తక్కువ

ఇతర పంటలతో పోల్చితే వీటికి ఎరువుల వినియోగం కూడా తక్కువగానే ఉంటుంది. పూల మొక్కలు నాటే ముందు 25 ట్రాక్టర్ల పశువుల ఎరువుకు రూ.20వేల వరకు ఖర్చు వస్తుంది. మొక్కలకు పోషక పదార్థాలు అందించే ఎరువులు వేసుకోవడానికి రూ. మూడు వేల వరకు ఖర్చు వస్తుంది. నాటిన వారం రోజుల తరువాత డ్రిప్ ద్వారా రసాయనిక ఎరువులు అందించాల్సి ఉంటుంది. ఈ విధమైన సాగుతో చీడపీడల, తెగుళ్ల బెడద ఉండదు. గాలి, వాతావరణం మార్పుల వల్ల నష్టం వచ్చే అవకాశం ఉండదు. కలుపు సమస్య అసలే ఉండదు.

మంచి డిమాండ్



పాలీహౌస్‌పై ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ అందజేసి రైతులను ప్రోత్సహించడం బాగుంది. నేను ఎకరం పొలంలో పాలీహౌస్ ద్వారా పూలసాగు చేపట్టాను. పెళ్లిళ్ల సీజన్‌లో పూలకు మంచి డిమాండ్ ఉంటుంది. అన్ని ఖర్చులు పోను నెలకు రూ.30వేల వరకు ఆదాయం వస్తుంది.

– సామ ప్రతాప్‌రెడ్డి, రైతు, ఎర్రొనిగూడ